

జీవీఎంసీలో ఇక 10 జోన్లు

» పరిపాలనా సౌలభ్యం కోసం నియోజకవర్గాల వారీగా విభజన

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో జోన్‌లను పునర్వ్యవస్థీకరించాలని అధికారులు నిర్ణయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఇప్పుడున్న ఎనిమిది జోన్‌లను పది జోన్‌లుగా విభజించారు. నాలుగునెలు కిందట అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతిరాగానే కొత్త జోన్‌లు అందుబాటులోకి రానున్నాయి. జీవీఎంసీ పరిధిలో ... మిగతా 6వ పేజీలో

జల వనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

ఎస్‌ఈ, సీఈ పోస్టుల్లో ధవళేశ్వరం సర్కిల్ అధికారులు

» ఇక్కడి కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం సమీక్షించడం ఎలా సాధ్యమని ఉద్యోగుల ప్రశ్న

» ఖాళీ పోస్టుల భర్తీకి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్



విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర రీజియన్ జల వనరుల శాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల నార్త్ కోస్టల్ సీఈగా పదోన్నతి పొందిన రామ్‌గోపాల్ గత నెలలోనే పదవీ విరమణ చేశారు. నార్త్ కోస్టల్ సీఈ పరిధిలో ఐదారు పోస్టులకు గాను ప్రస్తుతం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎస్‌ఈలున్నారు. వారిలో విజయనగరం తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈ స్వర్ణకుమార్‌కు విశాఖ సర్కిల్, నార్త్ కోస్టల్ సీఈ పోస్టు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో పర్యవేక్షించే మూడు పోస్టుల బాధ్యతలు ధవళేశ్వరం సర్కిల్ ప్రాజెక్టులో పనిచేసే అధికారులకు అప్పగించారు. ధవళేశ్వరం ప్రాజెక్టు సీఈకి నార్త్ కోస్టల్ సీఈ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ధవళేశ్వరంలో పనిచేసే ఇద్దరు ఎస్‌ఈలలో ఒకరిని విజయనగరంలోని తారకరామ తీర్థసాగర్ ఎస్‌ఈగా, మరొకరిని విశాఖపట్నం సర్కిల్ ఎస్‌ఈగా ఇన్‌చార్జి బాధ్యత లు అప్పగించారు. బొబ్బిలి సర్కిల్ ఎస్‌ఈ అప్పారావుకు వంశధార ప్రాజెక్టు ... మిగతా 6వ పేజీలో

అన్నదాతకు అండగా ఐఎండీ



అనకాపల్లిలోని వాతావరణ అబ్జర్వేటరీ

అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ ద్వారా నాలుగు జిల్లాల రైతులకు సేవలు

» వర్షం, ఉష్ణోగ్రతలు, గాలి వేగం, గాలిలో తేమ శాతంపై కచ్చితమైన లెక్క

» వాతావరణంలో మార్పులపై నాలుగైదు రోజుల ముందే సమాచారం

» గ్రామీణ కృషి మౌసం సేవా పథకం దోహదం

» వాతావరణ ఆధారిత వ్యవసాయంతో పలు ప్రయోజనాలు

అనకాపల్లిఅగ్రికల్చర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

వ్యవసాయ రంగంలో పంటలు సాగు యావత్తూ వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. దుక్కి దున్నడం నుంచి పంట ఇంటికి చేరే వరకు వివిధ దశల్లో వ్యవసాయాన్ని వాతావరణం ప్రభావితం చేస్తుంది. సకాలంలో సరైన వర్షాలు కురవకపోతే విత్తనాలు చల్లడం, నాట్లు వేయడం కష్టమే. పంట పూతదశలో, గింజకట్టే తరుణంలో ఎక్కువ రోజులు మబ్బు పట్టినా, వర్షాలు ముంచెత్తినా నష్టాలు తప్పవు. పంటలు నీటి ఎద్దడికి గురైతే కొన్ని రకాల చీడపీడలు దాడి చేస్తాయి. అతిశీతల వాతావరణం, అధిక తేమ లేదా తీవ్ర వర్షాల కారణంగా మరికొన్ని చీడపీడలు పంటలను ఆశిస్తాయి. పంట కోత సమయంలో భారీ వర్షాలు పడినా, వరదలొచ్చిన పరిస్థితి అతలాకుతలం అవుతుంది. కొన్నేళ్ల నుంచి వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, మండు వేసవిలో భారీ వర్షాలు కురవడం, వర్షాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు మండుతుండడం, మండే ఎండలు, ఏడాది మొత్తంలో కురవాల్సిన వర్షం వారం రోజుల్లోనే పడడం వంటివి జరుగుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కొనేలా శాస్త్ర, శాంకేతిక రంగాలు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నాయి.

భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వ్యవసాయ రంగానికి దన్నుగా నిలిచి రైతులను ఆదుకుంటున్నది. వాతావరణంలో వచ్చే మార్పులను ముందుగానే పసిగట్టి అన్నదాతలను హెచ్చరించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వాన రాకడను నాలుగైదు రోజులు ముందుగానే చెప్పగలుగుతున్నారు. ఉష్ణోగ్రతలు, గాలి వేగం, గాలిలో తేమ శాతం వంటి వాటిని కచ్చితంగా లెక్కగట్టగలుగుతున్నారు. ప్రతి నెలలో సాధారణ వర్షపాతంలో విపరీతమైన హెచ్చుతగ్గులు, పంటలు వేసే సమయం, పంట కాలం, పంట కోత సమయాల్లో వస్తున్న మార్పులకు తగిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. పంటల ప్రణాళికలో మార్పులు చేపట్టి ఆశించిన దిగుబడులు సాధించడం కోసం రైతులకు వాతావరణ ఆధారిత సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామీణ కృషి మౌసం సేవా పథకం

భారత వాతావరణ సంస్థ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ హెచ్చరికలు ఎప్పటికప్పుడు అందిస్తూ వాతావరణానికి అనుగుణంగా చేపట్టాలల్సిన సాగు పద్ధతులను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'గ్రామీణ కృషి మౌసం సేవా (జీకేఎంఎస్)' ... మిగతా 6వ పేజీలో

విస్తృతమవుతున్న నెట్ వర్క్



గ్రామీణ కృషి మౌసం యోజన నెట్‌వర్క్ మరింత విస్తృతం అవుతున్నది. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఇప్పుడున్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌కు అదనంగా మరొక వెదర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ వున్న ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ రోజూ ఉష్ణోగ్రతలు వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం తదితర సమాచారం సేకరించి భారత వాతావరణ సంస్థకు అందజేస్తుంది. వాతావరణ సంస్థ సమస్త వాతావరణ సమాచారాన్ని క్రోడీకరించి తుది వాతావరణ బులెటిన్‌ను విడుదల చేస్తుంది. అనకాపల్లిలోని గ్రామీణ కృషి మౌసం సేవా పథకంలో ఆరు వేల మంది రైతులు రిజిస్టరై ఉన్నారు. 70 వాట్సప్ గ్రూపులు ఉన్నాయి. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది.

డాక్టర్ వి.గౌరీదేవి,
ప్రధాన శాస్త్రవేత్త, ఆర్‌ఏఆర్‌ఎస్, అనకాపల్లి

జ్వరాల బారిన హాస్టల్ విద్యార్థులు

చాలీచాలని వసతితో పాట్లు

» రెండు గదుల్లో 44 మంది ఉండాల్సిన దుస్థితి

» అభివృద్ధి పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్


హాస్టల్‌లో జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులు

చోడవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

స్థానిక గాంధీగ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) బాలుర వసతిగృహంలో పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో హాస్టల్ వార్డెన్ సమాచారం ఇవ్వడంతో వైద్య సిబ్బంది వచ్చి సేవలు అందిస్తున్నారు. జ్వరాల తీవ్రత కొంతమేర తగ్గినప్పటికీ నీరసంతో ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు విద్యార్థులకు వసతి కొరత తీవ్రంగా వుంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండున్నర నెలలు కావవస్తున్నప్పటికీ వేసవిలో చేపట్టిన హాస్టల్ భవనం అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో 44 మంది విద్యార్థులు రెండు గదుల్లోనే సర్దుకుపోవాల్సి వస్తున్నది. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలాయి. ఒక్కో గదిలో 20 మందికిపైగా విద్యార్థులు వుండాల్సి రావడంతో ఒకరు వైరల్ జ్వరం బారిన పడితే.. ఒకటి, రెండు రోజుల్లోనే మిగిలిన వారు కూడా జ్వరాలబారిన పడుతున్నారు. కాగా వసతిగృహంలో రెండు బ్లాకుల్లో ఒకదానిని పాక్షికంగాపూర్తి చేయగా, మిగిలిన బ్లాక్‌కు పైకప్పు వేయాల్సి ఉంది. మొదటి బ్లాకులో మూడు గదులు అందుబాటులో వున్నప్పటికీ ఒక గదిలో కాంట్రాక్టర్ నిర్మాణ సామగ్రి వుంచారు. దీంతో విద్యార్థులు రెండు గదుల్లోనే సర్దుకుపోతున్నారు. హాస్టల్ పరిసరాల్లో దోమల బెడద ఎక్కువగా ఉండడంతో రాత్రిపూట నిద్రపట్టడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి హాస్టల్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల కోరుతున్నారు.


ఈ రెండు గదుల్లోనే 44 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు

మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు

అనకాపల్లి నుంచి లూప్‌లైన్‌లో చోడవరానికి బస్సు

» ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు


తగరంపూడి చేరుకున్న ఆర్టీసీ ట్రయల్ రన్ బస్సు

కొత్తూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి, చోడవరం మండలాల్లో పలు గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అనకాపల్లి నుంచి వెన్నపాలెం మీదుగా చోడవరానికి బస్సులు నడుస్తుండగా, మారుమూల గ్రామాలకు సైతం బస్సు సదపాయం అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా అనకాపల్లి నుంచి ఆయా గ్రామాల మీదుగా చోడవరానికి ఆదివారరం ట్రయల్ రన్ నిర్వహించారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బయలుదేరిన బస్సు అనకాపల్లి మండలం తుమ్మపాల, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, మెట్టపాలెం, చోడవరం మండలం రామజోగిపాలెం, జన్నవరం, పీఎస్‌పేట మీదుగా చోడవరానికి చేరుకుంది. ప్రధాన రహదారికి దూరంగా వున్న గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారులు స్పందించారు. ఏయే వేళల్లో ఆర్టీసీ బస్సు అవసరమో తెలియజేస్తే ఆ సమయాల్లో బస్సులు నడుపుతామని అనకాపల్లి డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ వై.ఎస్.రత్నం తెలిపారు. ఆర్టీసీ బస్ ట్రయల్ రన్ కార్యక్రమంలో వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, కూటమి నాయకులు భరత్ బాబు, భీశెట్టి అప్పారావు, మళ్ల సురేశ్, పొలమరశెట్టి నరసింగరావు, నక్కా చెల్లయ్య, ఆర్.గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్న సీఎం చంద్రబాబు

» అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి అనిత

తుమ్మపాల (అనకాపల్లి), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తల గౌరవాన్ని పెంచేందుకు అధిష్ఠానం తగిన పదవులు కట్టబెడుతున్నదని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడ టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో జరిగిన సంస్థాగత నిర్మాణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో గాడితప్పిన రాష్ట్రాన్ని ఏడాదిలోనే అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు, బాపట్ల జిల్లా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, దేశంలో కోటి మందికిపైగా సభ్యత్వాలు కలిగిన ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీ అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని, టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత కార్యకర్తలదేనన్నారు. జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకు కార్యకర్తలు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. పార్టీ పదవుల విషయంలో సీనియర్లకు ప్రాధాన్యతం ఇవ్వడంతోపాటు ఇదే సమయంలో యువతకు అవకాశాలు కల్పిస్తూ మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. తొలుత కార్యాలయ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, వంశీ, చింతకాయల రాజేశ్, కోరాడ రాజబాబు, బొండా జగన్, లాలం కాశీనాయుడు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు కేపీఎల్ లక్ష్యాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారానికి పెద్దపీట

» తక్కువ బరువు, వయస్సుకి తగ్గ ఎత్తు లేని పిల్లలు రెండు శాతం తగ్గించాలని లక్ష్యం


అంగన్‌వాడీ కేంద్రంలో బాలలు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లకు పౌష్టిహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రభుత్వం ఐసీడీఎస్‌కి ఏడు కేపీఎల్ (కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్) పెట్టడం ద్వారా 2025-26 సంవత్సరానికి కీలక పనితీరు లక్ష్యాలను నిర్దేశించింది. గర్భిణులు, బాలింతలతోపాటు వయస్సుకితగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలకు నూరు శాతం పౌష్టిహారం అందించాలని ఆదేశించింది. జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిద్వారా 8,240 మంది గర్భిణులు, 7,051 మంది బాలింతలు, ఏడు నెలల నుంచి మూడు సంత్సరాలలోపు చిన్నారులు 42,430 మంది, మూడు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు 15,896 మంది పౌష్టికాహారాన్ని పొందుతున్నారు. గర్భిణులు, బాలింతల రేషన్ సరుకులను ఇళ్లకు తీసుకెళ్లవచ్చు. వీరికి ప్రతి నెలా మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటరు వంటనూనె, 25 కోడిగడ్లు సరఫరా చేస్తారు. ఇక రాష్ట్ర బడ్జెట్ నుంచి బాలసంజీవని ... మిగతా 6వ పేజీలో


రవాణా కష్టాలు

తాచేరు కాజ్‌వే పునరుద్ధరణలో తీవ్ర జాప్యం

» రాకపోకలకు పలు మండలాల ప్రజల ఇక్కట్లు

చోడవరం/ బుచ్చెయ్యపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

గత వారం కురిసిన భారీ వర్షాలతో తాచేరు గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో చోడవరం- వడ్డాది మార్గంలో విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు కాని పరిస్థితి నెలకింది. వర్షాలు తగ్గుముఖం పట్టి ఐదు రోజులు అయినప్పటికీ ఇంతవరకు కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


విజయరామరాజుపేట వైపు నుంచి కాజ్‌వే పరిస్థితి


కాజ్‌వే కొట్టుకుపోవడంతో బయటపడిన తూములు

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలవాసులకు కీలకమైన చోడవరం- వడ్డాది రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు గెడ్డపై పురాతన వంతెన రెండేళ్ల క్రితం కూలిపోయింది. అప్పటి నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన పక్కన కాజ్‌వే నిర్మించినప్పటికీ, నదిలో కొద్దిపాటి వరద ప్రవాహానికే కొట్టుకుపోతున్నది. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టుతోపాటు చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ మండలాల ప్రజలు గౌరీపట్నం, విజయరామరాజుపేట, ఖండివరం తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించవలసి వస్తున్నది. ఇక్కడ పక్కా వంతెన నిర్మాణంపై ఎలాంటి కదలిక లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. వారం రోజుల క్రితం ... మిగతా 6వ పేజీలో


పూల్‌బాగ్ వెళ్లే మార్గంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు


ఇది కాలువ కాదు.. రోడ్డే!

డ్రైనేజీ నిర్మాణంతో రహదారిపైకి మురుగు నీరు

» అధ్వానంగా పూల్‌బాగ్ జంక్షన్

» నూకాంబిక ఆలయానికి వెళ్లే భక్తుల ఇక్కట్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):


నూకాంబికనగర్‌లో డ్రైనేజీ కాలువ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలోని పూల్‌బాగ్ జంక్షన్ వద్ద రహదారులపై మురుగు నీరు తాండవిస్తున్నది. ఆలయానికి వెళ్లే భక్తులతోపాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఇండోర్ స్టేడియం నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు ఇటీవల డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ప్రత్యామ్నాయం చూపకుండా పనులు చేపట్టడం వల్ల నూకాంబిక నగర్ రోడ్డులో మురుగునీరు నిలిచిపోయింది. ఇంకా పూల్‌బాగ్ వెళ్లే జంక్షన్ అంతా మురికికూపంలా తయారైంది. మురుగు నీరు నూకాంబిక ఆలయానికి వెళ్లే మార్గంలో ఒక పక్కన దుకాణాల ముందు నిలిచిపోయింది. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి, మురుగు నీరు రహదారిపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హైమా నేత్రాలయం అధినేత డాక్టర్ పీఎస్ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం తహసీల్దారు అడపా వేణుగోపాల్, టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, బొంది కాశీ విశ్వనాథం, ఎం.రమాకుమారి, పల్లా విలియంకేరి, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు, దువ్వి శ్రీను, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

వినాయక చవితిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించాలని జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు మత్తి కార్తీక్ పిలుపునిచ్చారు. మండలంలోని గోకులపాడులో ఆదివారం గ్రామస్థులకు ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు నక్కా శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు గొర్లి సురేష్, రమణబాబు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యం

నక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే విశాఖ డెయిరీ లక్ష్యమని డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని రేబాకలో చినదొడ్డిగల్లు బీసీసీ సూపర్‌వైజర్‌గా పనిచేసిన నక్కా కిరణ్‌కు ఆత్రేయపురం బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా ఆయన్ని డెయిరీ తరపున పలువురు ఘనంగా సత్కరించారు. కిరణ్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, తుని యూనిట్ మేనేజర్ ఎం.శ్రీను, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, రేబాక మాజీ సర్పంచ్ శ్రీహరిరాజు, కాసుబాబు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ మండపాలకు అనుమతులు తప్పనిసరి : సీఐ

పాయకరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే ఉత్సవ మండపాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ జి.అప్పన్న తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేశ మండపాల ఏర్పాటుకు పాటించాల్సిన నియమ నిబంధనలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో గణేశ్ మండపాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎటువంటి రుసుం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. స్టేజి, మైక్, లైటింగ్ అనుమతుల కోసం పోలీస్ శాఖ జారీచేసిన నిబంధనలకు లోబడి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అప్పటికప్పుడే అనుమతులు జారీఅవుతాయన్నారు. ఈ అవకాశాన్ని ఉత్సవాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకుని పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ కాలనీలో దొంగలు హల్‌చల్

- మహిళను గాయపరిచిన దొంగ

అచ్యుతాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మార్టూరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఒక మహిళను గాయపరిచారు. దీనికి సంబంధించిన సీఐ నమ్మి గణేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి.

ఇందిరమ్మ కాలనీలో శనివారం రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు ముందుగా ఒక ఇంట్లో ప్రవేశించారు. ఆ ఇంట్లో మానసిక వైకల్యం గల యువతి ఉంది. దొంగలు ఇంట్లోకి వెళ్లి బీరువా తెరుస్తుండగా మాటలు సక్రమంగా రాని ఆ యువతి కేకలు వేయడంతో పారిపోయారు. తర్వాత సెజ్‌లో ఒక కర్మాగారంలో కెమిస్ట్రీగా పనిచేస్తున్న పూస శ్రీనివాసరావు, భార్య నాగమల్లేశ్వరి ఇంట్లోకి దొండలు ప్రవేశించారు. అలికిడికి భర్యాభర్తలు మేలుకున్నారని, దీంతో దొంగలు నాగమల్లేశ్వరిని గాయపరిచారని సీఐ గణేశ్ తెలిపారు. ఆమెకు తలకు గాయమై ముక్కు, నోటి నుంచి రక్తం రావడంతో ఆసుపత్రిలో చేర్పామన్నారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీం ఆదివారం వచ్చి ఆధారాలు సేకరించిందని, ఎటువంటి ఆస్తినష్టం జరగలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

నరేంద్రకు ఒకేసారి రెండు ఉద్యోగాలు


నరేంద్ర

నక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ జగన్నాథపురం గ్రామానికి చెందిన పిట్ల స్వామి నరేంద్రకు ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈయనకు గతంలో ఇండియన్ నేవీలో ఉద్యోగం వచ్చినప్పటికీ టీచర్ ఉద్యోగంపై ఇష్టంతో ఆ అవకాశాన్ని వదులుకున్నారు. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం లభించింది. ఇదే సమయంలో డీఎస్సీ రాయడంతో ఏజీటీ విభాగంలో 84.65 మార్కులు సాధించాడు. ఒకేసారి కానిస్టేబుల్, టీచర్ ఉద్యోగాలకు నరేంద్రకు అర్హత సాధించడంతో తల్లిదండ్రులు నాగేశ్వరరావు, కుమారి ఆనందపడ్డారు. భవిష్యత్‌లో గ్రూప్1, 2 ఉద్యోగాలు సాధించాలని లక్ష్యంతో పనిచేస్తానని నరేంద్ర చెప్పారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

ఎస్.రాయవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీ అయిన సిబ్బందిని ఆదివారం స్థానిక సర్పంచ్ దూళి శ్రీనుబాబు, టీడీపీ నేత ఎన్.వెంకటరాజు, గ్రామ పెద్దలు శ్రీపతిరాజు ఘనంగా సన్మానించారు. వారంతా గ్రామస్థులకు చేసిన సేవలను కొనయాడారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కోటవురట్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి, సుంకపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి చెక్కులను టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు ఆదివారం అందజేశారు. కొడవటిపూడికి చెందిన కోసూరి చంటికి రూ.లక్ష 48 వేలు 415, సుంకపూర్‌కి చెందిన చిటికెల విజయకు రూ.49,625 చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి హోంమంత్రి వంగలపూడి అనిత సిఫార్సు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైనట్టు లింగంనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, వేచలపు భాస్కరరావు తెలిపారు.

రోడ్డుపై మురికి నీరు

- తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు


గాజువాక రోడ్డులో మురికి నీరు ప్రవహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్యుతాపురం-గాజువాక రోడ్డులో ఆదివారం ఉదయం నుంచి భారీగా మురికి నీరు ప్రవహించింది. దీంతో వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అచ్యుతాపురంలో సగభాగం మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఉంది. ఎలమంచిలి, అనకాపల్లి, గాజువాక రోడ్లతోపాటు పూడిమడక రోడ్డులో కొంతభాగం కూడా మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఉంది. అయితే గాజువాక రోడ్డులో డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో కాలువలో మురికి నీరు పొంగి ఆదివారం రోడ్డు మీదకు వచ్చేసింది. మోసయ్యపేటలోని కాలువల్లో గల నీరంతా గాజువాక రోడ్డులో గల కాలువగుండా వచ్చేసి మరిడిమాంబ ఆలయం వద్ద నిల్వ ఉండిపోయింది. మురికి నీరు ఎటూ పోవడానికి వీలు లేకపోవడంతో రోడ్డు మీదకు వచ్చేసింది. మరిడి మాంబ ఆలయ ప్రాంగణమంతా మురికి నీరుతో మునిగిపోయింది. దీంతో చుట్టుపక్కల ఉన్న వారు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురికి నీరు పోయేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి అనిత


పెంటకోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెంటకోటలో ఆదివారం రూ. రెండు కోట్లతో నిర్మించే బహుళార్థక సాధక మత్స్యకేంద్రం, రూ.1.52 కోట్లతో నిర్మించే కల్వర్టు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు రెండు బహుళార్థక సాధక మత్స్యకేంద్రాలు మంజూరయ్యాయని, వాటిలో ఒకటి పరవాడ, మరొకటి పెంటకోటలో నిర్మిస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు 20 వేల రూపాయలను భరోసా ఇచ్చామన్నారు. గత వైసీపీ పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వ నాశనం చేశారని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కల్వర్టును కనీసం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వినోద్‌రాజు, చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలు, పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, ఎం.రమాకుమారి, గూటూరు శ్రీనివాసరావు, జిల్లా మత్స్య శాఖాధికారి జి. విజయ పాల్గొన్నారు.

గణితంలో మొదటి ర్యాంకర్ విజయ్‌కు సత్కారం


నక్కపల్లిలో విజయ్‌ను సత్కరిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

నక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ గణితంలోని మూడు విభాగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఎస్.రాయవరం మండలం వమ్మవరం అగ్రహారానికి చెందిన సుంకరణం విజయ్‌ను హోంమంత్రి వంగపూడి అనిత ఆదివారం నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గణితంలోని మూడు కేటగిరిల్లో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. మంచి ర్యాంకులు సాధించిన ఇతర అభ్యర్థులందరికీ హోం మంత్రి అనిత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, యేజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్దం, గుర్రం రామకృష్ణ, పల్లెల జగ్గారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

డీఎస్సీలో గణితంలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన వమ్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన సుంకరణం విజయ్‌ను ఆదివారం అడ్డరోడ్డులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల అధ్యక్షుడు బాదనపల్లి జోగినాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ భరత్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో వసతులు ఏర్పాటు చేయాలి

- మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు


అప్పలరాజు

ఎస్.రాయవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డులో గల చేపల మార్కెట్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివా రం అప్పలరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అడ్డరోడ్డు చేపల మార్కెట్‌లో వసతులు లేకపోవడంతో చెట్ల కిందే చేపలు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ ప్రభుత్వం వచ్చిన మత్స్యకారులను చులకనగా చూస్తున్నారని ఆయన విమర్శించారు. చేపల మార్కెట్‌లో షెడ్లు, మరుగుదొడ్లు, తదితర వసతులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో పిక్కి. గొర్లయ్య, జగ్గారావు, గంగరాజు పాల్గొన్నారు.

కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

నక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామ స్థాయి నుంచి పటిష్టపరిచేందుకు మేధావులు, విద్యావంతులు, కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం రేబాకలో జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజును ఘనంగా సత్కరించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు పోలినాటి నానాజీ, నక్కపల్లి సొసైటీ డైరెక్టర్ కోసూరి శ్రీను, జిల్లా కార్యదర్శి దాడిశెట్టి ఈశ్వరరావు, కొల్నాటి అప్పారావు, శివ, శానాపతి విజయ్ పాల్గొన్నారు.

ఆదివారం కూడా ఎరువుల విక్రయం

మునగపాక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఆదివారం కూడా ఎరువులు విక్రయించినట్టు పీఏసీఎస్ చైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం యూరియా విక్రయించామన్నారు. కలెక్టర్ సూచనతో పీఏసీఎస్ వద్ద 12 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగపాక గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్, ఉపాధ్యక్షుడు దాడి శివ, పీఏసీఎస్ ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ హిట్

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు

రాంబిల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు అన్నారు. ఆదివారం ఆయన హరిపురం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన మాట మేరకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెన్షన్‌దారులకు వెయ్యి రూపాయలు పెంచిందన్నారు. మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేశారన్నారు. తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు బడికి వెళితే అంత మందికి వారి ఖాతాల్లోకి డబ్బులు జమ చేశారన్నారు. రైతులకు సకాలంలో రైతు భరోసా అందించడం జరిగిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజలు ఆనందంతో ఉంటే వైసీపీ నాయకులు చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వ పాలనపై లేనిపోని విమర్శలు చేస్తూ రోజురోజుకూ దిగజారిపోతున్నారన్నారు. విలేకర్ల సమావేశంలో కూటమి నాయకులు అందుకూరి ప్రసాద్, దూళి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎలమంచిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న ఎస్.జ్యోతిశ్ దుర్గా ప్రసాద్ (21) ఈ నెల 20వ తేదీన ఒంటిపై పెట్రోలు పోసుకుని తీవ్ర గాయాలై.. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె. సావిత్రి తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 18వ తేదీన దుర్గాప్రసాద్ రూ.రెండు వేలను తన వదిన శాంతికి ఇచ్చి 3 గంటల తరువాత వెనక్కి ఇవ్వాలని గొడవ పడ్డాడు. ఈ విషయమై తండ్రి నూకరాజు మందలించాడు. దీంతో వారితో గొడవ పడి దుర్గాప్రసాద్ బయటకు వెళ్లిపోయాడు. ఈనెల 20వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వస్తూ మామిడి తోటలో ఒంటిపై పెట్రోలు పోసుకుని అగ్గి పెట్టుకున్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎలమంచిలి సీహెచ్‌సీ తీసుకువెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ సావిత్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'దోమాడ'కు మదర్ థెరెసా జాతీయ ప్రతిభా పురస్కారం


దోమాడ సుందరరావుని సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పాలకవర్గం మాజీ డైరెక్టర్ దోమాడ సుందరరావుని మదర్ థెరెసా ఎడ్యుకేషనల్ సొసైటీ జాతీయ ప్రతిభా పురస్కారంతో ఘనంగా సత్కరించింది. ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దిడ్డి కిషోర్ తదితరులు తనను ఘనంగా సత్కరించి, జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశారు.

మత్స్యకారుల వలలో దండిగా పడిన టూనా చేపలు

అచ్యుతాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పూడిమడక మత్స్యకారులకు ఆదివారం సూర (టూనా)తో పాటు కొమ్ముకోనెం చేపలు భారీగా చిక్కాయి. మత్స్యకారులు సాధారణంగా ఉదయం చేపల వేటకు వెళ్లి సాయంత్రానికి తిరిగి తీరానికి చేరుకుంటారు. అయితే ఆదివారం మాత్రం సాయంత్రం నుంచి రాత్రి వరకు పడవలు తీరానికి చేరుతునే ఉన్నాయి. టూనా కేజీ రూ.200, కొమ్ముకోనెం కేజీ రూ.250 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సీజ్

ఎలమంచిలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొండను తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ఒక ట్రాక్టరును సీజ్ చేసినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర ఆదివారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గూడుపమ్మను దర్శించుకున్న ప్రముఖులు

నక్కపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయాన్ని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు, ప్రముఖులు దర్శించుకున్నారు. అడ్డరోడ్డు, నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు ఎల్.రామకృష్ణ, కె.కుమారస్వామి, అప్పన్న గూడుపమ్మను దర్శించుకున్నారు. పలు పార్టీల నాయకులు తోట నగేశ్, రెడ్డి రామకృష్ణ, వీసం రామకృష్ణ, పరమేశ్వరరావు, కొప్పిశెట్టి కొండబాబు, రవిరాజు, కోసూరి శ్రీను, పోలినాటి నానాజీ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, అర్చకులు కృష్ణమాచార్యులు, సుధారాజు, రవివర్మ దర్శించుకున్నారు. ప్రముఖులకు ఆలయం తరఫున అమ్మవారి చిత్రపటాలను అందజేసి, శేషవస్త్రాలతో ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు సత్కరించారు.

తూర్పుకాపుల సర్టిఫికెట్ల మంజూరుకు కృషి

కొత్తూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు తూర్పుకాపు సర్టిఫికెట్ల మంజూరుకు కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం శ్రీహరి చెప్పారు. కొత్తూరు పంచాయతీ పరిధిలోని శారదానగర్‌లో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులను నియమించారు. అనకాపల్లి నియోజకవర్గానికి నక్కా శివశంకర్, చోడవరానికి పోలిన సూర్యజగ్గారావు, పాయకరావుపేటకు అడపా శేషగిరిరావు, యలమంచిలికి అంది రమణ, మాడుగులకు ఎస్.నానాజీ, నర్సీపట్నంకు ఎ.శ్రీనివాసరావులను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన డిఎస్సీ ఫలితాల్లో తూర్పుకాపు సర్టిఫికెట్ మంజూరుతో అధిక శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా రిజర్వేషన్ తమకు ఆశించిన స్థాయిలో వర్తించిందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు పోలిన సూర్యజగ్గారావు, పల్లెల నాగేశ్వరావు, పోలిన వెంకటేశ్వరరావు, పల్లెల జగన్నాథం, సియాద్రి నాగేశ్వరరావు, గోపాల్, చిన్నినాయుడు, పల్లెల శ్రీను, ఈశ్వరరావు, చిన్ని శ్రీను పాల్గొన్నారు.

జల వనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

... 5వ పేజీ తరువాయి

ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. వర్షాకాలంలో గోదావరికి వరదలు వస్తుంటాయి. ఆ సమయంలో అక్కడ ఏఈ నుంచి సీఈ వరకూ ప్రతి ఒక్కరిపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. రుతుపవనాలు సీజన్ గోదావరికి వచ్చే వరదపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇటువంటి సమయంలో వారు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం ఇత్యాది అంశాలను సమీక్షించి ఆదేశాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని జల వనరుల శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల ఈఈలకు మూడు పాత జిల్లాల్లో ఎస్ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే సబబుగా ఉండేదని వ్యాఖ్యానిస్తున్నారు. జల వనరుల శాఖలో డీఈ, సీఈల ఖాళీలను భర్తీచేయకుండా కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తరాంధ్రలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇక్కడ ఖాళీలను భర్తీచేసేలా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

అన్నదాతకు అండగా ఐఎండీ

... 5వ పేజీ తరువాయి

పథకాన్ని ప్రారంభించింది. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ ద్వారా వారంవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల రైతులకు వాతావరణ హెచ్చరికలు, వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు తెలియజేస్తున్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తలు ప్రతి మంగళవారం సమావేశమై భారత వాతావరణ సంస్థ అందజేసిన సమాచారం ఆధారంగా రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. వీటిని రైతుల మొబైల్ ఫోన్లు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా అందజేస్తున్నారు. రాగల ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం, వర్ష సూచనలతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులకు అనుకూలంగా రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను సూచిస్తుంటారు. వర్షాలు పడే పరిస్థితి ఉంటే పంట కోతలు, నూర్పు పనులను వాయిదా వేసుకోవాలని సూచిస్తారు. మబ్బు పట్టిన వాతావరణం వల్ల పంటలను ఆశించే చీడపీడలు వాటి నివారణ చర్యలను వెల్లడిస్తారు. భారీ వర్షాల కారణంగా పంటలు ముంపునకు గురైతే పొలంలో చేపట్టాల్సిన పనులను సూచిస్తారు. గత ఏడాది వరి కోతలు, నూర్పుల సమయంలో వచ్చిన వర్షాల గురించి రైతులను ముందుగా అప్రమత్తం చేయడం వల్ల వారు నష్టాన్ని తగ్గించుకోగలిగారు.

వాతావరణ ఆధారితక సాగుపై రైతులకు అవగాహన

డాక్టర్ కె.వి.రమణమూర్తి, నోడల్ అధికారి,
గ్రామీణ కృషి మౌసం సేవా పథకం



వివిధ వాతావరణ పరిస్థితులకు అవసరమైన సాగు పద్ధతులను రూపొందించాం. తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు, పైరు విత్తిని తొలి దశలో నీటి ఎద్దడికి గురైతే, పెరిగే దశలో నీటి ముంపుకు గురైతే, రుతుపవనాలు నాలుగు వారాలు ఆలస్యం అయినప్పుడు, ఎనిమిది వారాలు ఆలస్యం అయినప్పుడు.. ఇలా వివిధ పరిస్థితుల్లో ఆయా పంటలకు అవసరమైన యాజమాన్య పద్ధతులను సిద్ధంచేశాం. అవసరం, సమయాన్నిబట్టి రైతులకు తెలియజేస్తాం. రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు వాతావరణ ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

రవాణా కష్టాలు

... 5వ పేజీ తరువాయి

కురిసిన భారీ వర్షానికి విజయరామరాజుపేట కాజ్‌వే కొట్టుకుపోయింది. తర్వాత వాగులో వరద ఉధృతి తగ్గినప్పటికీ, కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. ఆర్టీసీ బస్సులను ఇతర మార్గాల్లో నడుపుతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఒక కి.మీ. దూరం.. పది కి.మీ.ల ప్రయాణం

విజయరామరాజుపేట వద్ద తాచేరు గెడ్డపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే.. ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ రెండు మధ్య దూరం ఒక కిలోమీటరు కాగా, కాజ్‌వే ధ్వంసం కావడంతో చుట్టూ తిరిగి పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నది. తాచేరు గెడ్డకు ఇవతల విజయరామరాజుపేట, అవతల వడ్డాది గ్రామాలు వున్నాయి. విద్య, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాల నిమిత్తం నిత్యం వందలాది మంది అటుఇటు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాచేరు కాజ్‌వే కొట్టుకుపోవడంతో విజయరామరాజుపేట ప్రజలు మంగళాపురం, కేజే పురం మీదుగా సుమారు పది కిలోమీటర్ల ప్రయాణించి వడ్డాది చేరుకోవాల్సి వస్తున్నది.

కాగా కాజ్‌వే పునరుద్ధరణపై ఆర్అండ్‌బీ జేఈ సత్యకుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రూ.30 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపడతామని చెప్పారు.

ఐసీడీఎస్‌కు కేపీఎల్ లక్ష్యాలు

... 5వ పేజీ తరువాయి

ఐదు లీటర్ల పాలు, న్యూట్రిషన్ కిట్, ఒక కిలో అటుకులు, రెండు కిలోలు రాగి పిండి, 250 గ్రాముల బెల్లం, వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం అందజేయాలి. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలు చిన్నారులకు బాలామృతం, 30 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఇవ్వాలి. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ పెట్టే ఆహారంలో 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, ఐదు మిల్లీలీటర్ల మంచినూనె, కోడి గుడ్డు వుండాలి. రోజూ 100 మిల్లీలీటర్ల పాలు ఇవ్వాలి. కాగా జిల్లాలోని ఐసీడీఎస్‌ల పరిధిలో ఉన్న పిల్లల్లో బరువు తక్కువ ఉన్న వారు 18.29 శాతం మంది, వయస్సుకి తగ్గ ఎత్తు లేని పిల్లలు 7.8 శాతం వున్నట్టు అధికారులు గుర్తించారు. పౌష్టికాహారం అందించడం ద్వారా ఈ ఏడాది తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లలను రెండు శాతం చొప్పున తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది.

కేపీఎల్ లక్ష్యాలు ఇవే

- గర్భిణులు, బాలింతలకు వంద శాతం టీహెచ్ఆర్ ఇవ్వాలి
- ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు వంద శాతం టీహెచ్ఆర్ ఇవ్వాలి
- వయసుకి తగ్గ ఎత్తు లేని పిల్లలను రెండు శాతం తగ్గించాలి
- వయసుకి తగ్గ బరువు లేని పిల్లలను 2 శాతం తగ్గించాలి
- ప్రీ స్కూల్ పిల్లలు నెలలో కనీసం 21 రోజులు హాజరవ్వాలి
- బాల్య వివాహాలను నిరోధించాలి

జీవీఎంసీలో ఇక 10 జోన్లు

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్నాయి. ఒక జోన్.. రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించి ఉంది. తూర్పు నియోజకవర్గంలో ఉన్న 9, 10, 11, 12, 13 వార్డులు జోన్-2 (మధురవాడ)జోన్‌లో ఉన్నాయి. అదే విధంగా భీమిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న 5, 6, 7, 8, 98 వార్డులు జోన్-2లో ఉన్నాయి. ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఉన్న 14, 24, 25, 26 వార్డులు జోన్-3 లో ఉన్నాయి. నియోజకవర్గం ఒకటి, జోన్ మరొకటి కావడంతో అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటే రెండు, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు రెండు, మూడు జోన్‌ల అధికారులను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గం పరిధిలోని వార్డులు ఆ జోన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, అదనపు, జోనల్ కమిషనర్లు నాలుగు నెలల కిందట సమావేశమై వార్డు, జోన్‌ల సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా జోన్‌లు ఏర్పాటు చేస్తే ఏ వార్డులు ఎందులో చేరుతాయనే దానిపై ఒక డ్రాఫ్ట్ తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా కావడంతో ఒక వార్డు ప్రజలు జోన్ కార్యాలయానికి రావాలంటే చివరన వుండే వార్డుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని, ఈ నేపథ్యంలో ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లుగా విభజించాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పరిధిలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోన్, భీమిలి, పెందుర్తికి రెండేసి జోన్‌లు ఏర్పాటుకానున్నాయి.

ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని ఫిలిం సొసైటీ గౌరవాధ్యక్షులు తమ్మన సుబ్బారావు, వ్యవస్థాపక కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సొసైటీ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 31వ తేదీన వుప్పల రమాకుమారి మినీ హాల్‌లో '35 చిన్న కథ కాదు' అనే తెలుగు సినిమాను ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫిలిం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. సొసైటీ అధ్యక్షురాలుగా సరిపల్లి సూర్యకుమారి, ఉపాధ్యక్షులుగా వేణుమాస్టార్, ఐఆర్ గంగాధర్, కార్యదర్శిగా పీఎస్ అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా జీఎల్ఎన్ శాస్త్రి, డాక్టర్ దివితేజ, కోశాధికారిగా శ్రీధరాల సూర్యనారాయణ, సభ్యులుగా దొడ్డి అప్పారావు, అజయ్, గౌరవాధ్యక్షులుగా తమ్మన సుబ్బారావు ఎంపికయ్యారు.

వినాయకుడిని ప్రకృతి సిద్ధంగా పూజించాలి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతి సిద్ధంగా వినాయకుడ్ని పూజించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పిలుపునిచ్చారు. గవరపాలెం పెదరామస్వామి ఆలయం వద్ద ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి అంటే ప్రకృతిని పూజించడంలో ఒక భాగమన్నారు. ఈ పూజా ద్రవ్యాల్లో ప్లాస్టిక్ వస్తువులను, ప్లాస్టిక్ అలంకరణను నిరోధించాలన్నారు. వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, మళ్ల రాజా, బి.శంకరరావు, కె.చినఅప్పలనాయుడు, కోరిబిల్లి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న రత్నాకర్

అలాగే పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ మెంబర్ రేబాక మధుబాబు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి మనోజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.మురళీధర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేయాలి

కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొల్లి శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేయాలని కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఓరుగంటి రాఘవరావు పిలుపునిచ్చారు. కమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి సమీపంలో ప్రజలకు వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ధనాల వెంగళరావు, ప్రతినిధులు పర్వతనేని శ్రీనివాస్, గోల రాఘవనాయుడు, కామినేని గంగాధర్, జి.మోహన్‌బాబు, పర్వతనేని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న రాఘవరావు

ఆక్రమణలకు అడ్డుకట్ట

సబ్బవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. సర్వే నంబరు 249లో సుమారు 69 సెంట్ల ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారు. ఈ భూమిలో పక్కా నిర్మాణాలు సాగిస్తున్న సమాచారాన్ని ఇరిగేషన్ ఏఈ కార్తీక్, తహశీల్దార్ చిన్నికృష్ణ తెలుసుకున్నారు. దీంతో ఆర్‌ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు, ఇరిగేషన్ సిబ్బంది, పోలీసులు ఆదివారం వెళ్లి ఎక్సకవేటర్ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆర్‌ఐ హెచ్చరించారు.

నేడు ఎంపీ సీఎం.రమేశ్ పర్యటన

సబ్బవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగలిపురం గ్రామంలో అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ సోమవారం పర్యటిస్తారని జనసేన మండల కన్వీనర్ కర్రి కనకరాజు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారని చెప్పారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ ఎమ్మెల్యేతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కూటమి నేతలు హాజరుకావాలని కోరారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

పరవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ పరిధిలోని బొట్టవానిపాలెంలో కృష్ణాష్టమి వేడుకలకు జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ హాజరై శ్రీకృష్ణుని దర్శించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు చేతుల మీదుగా శ్రీకృష్ణుని చిత్రపటాన్ని పంచకర్లకు అందజేశారు. ఈ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే పోటీలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని ప్రతిమను గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

రహదారి భద్రతపై ఆటో కార్మికులకు అవగాహన

కశింకోట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక ఆటో యూనియన్ కార్మికులకు రహదారి భద్రతపై ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు పాల్గొని రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులకు తరలించడం ప్రమాదకరమన్నారు. ఈ విషయాన్ని డ్రైవర్లు గమనించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బత్తిన వీరభద్రం, ఒమ్మి శ్రీనివాసరావు, మోసూరు చిన్న, నీలపాటి లోవరాజు, సంతోష్, రాజు పాల్గొన్నారు.

మొల్లివీధిలో శ్రీకృష్ణుని దర్శించుకున్న రాంకీ

కొత్తూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరు మొల్లివారి వీధిలోని శ్రీకృష్ణునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రాంకీని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సప్పారపు ప్రసన్నలక్ష్మి, నాయకులు దూలం గోపి, బర్ల నాగరాజు, మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీను, పందాల సత్యగోవింద, మేడిశెట్టి నూకరాజు, మద్దాల సుబ్రహ్మణ్యం, మొల్లి సత్తిబాబు, తరుణ్ పాల్గొన్నారు.

సిరసపల్లిలో కంటి వైద్య శిబిరం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సిరసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్యాంగ్ ఆఫ్ స్టార్స్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 81 మంది రోగులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్స కోసం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గవర సురేశ్, కె.సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు పాల్గొన్నారు.

శారదానగర్‌లో పూడికతీత పనులు

కొత్తూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు శారదానగర్ నాలుగో వీధిలోని కాలువల్లో ఆదివారం పూడికతీత పనులు ప్రారంభించారు. సర్పంచ్ ప్రసన్నలక్ష్మి, వార్డు సభ్యులు ఈ పనులు చేపట్టారు. కాలువల్లోని చెత్తా చెదారాలను ఎక్సకవేటర్‌తో తొలగించారు. కాలువలు ఉన్న ప్రతి వీధిలోనూ పూడికలు తీసే కార్యక్రమం జరుగుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుభాశ్, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు తాడి చక్రవర్తి, నాయకులు టి.జయబాబు, బి.రాజు, అనిల్, ఎన్.రాజు, ఎస్.వరహాలబాబు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో టెన్నీకాయిట్ పోటీలు

లంకెలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి టెన్నీకాయిట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలను ఎంపికవుతారని అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. కార్పొరేటర్ శ్రీనివాస్, హెచ్‌ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న హోం మంత్రి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారిని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించుకున్నారు. పర్చూర్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏపీ స్టేట్ మినిమం వేజస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుతో కలిసి ఆలయానికి వచ్చారు. వీరికి ఆలయ ఈవో కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను స్వాగతం పలికారు. బాలాలయంలోని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.


హోం మంత్రికి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతియేటా మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసే శిల్పిని రాంకీ సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

పాడేరురూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ తెగల (ఎస్సీ) యువతీ, యువకులకు మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్య నిర్వాహక సంచాలకులు ఎం. సత్యపద్మ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలో భాగంగా 20 సంవత్సరాలు వయస్సు పైబడిన ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు 40 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన యువతీ, యువకులు షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ, ఎంవీపీ కాలనీ, విశాఖలోని కార్యాలయంలో సంప్రదించి ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 98499 05960, 8317559817 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

వైసీపీలో సీనియర్లకు ప్రాధాన్యంలేదు

మాజీ ఎంపీపీ వంతల బాబూరావు


మాజీ ఎంపీపీ బాబూరావు

చింతపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో సీనియర్ నాయకులకు ప్రాధాన్యంలేదని, కేవలం ఒక వర్గానికి చెందిన కార్యకర్తలు, నాయకులకు మాత్రమే అధిష్ఠానం పార్టీ పదవులు కట్టబెడుతుందని తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ వంతల బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌లోనూ, జగన్మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించడంతో వైసీపీలోకి తాను చేరానన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కార్యకర్తగా పనిచేశానన్నారు. తాను ఎంపీపీగా ఎన్నిక కావడాన్ని జీర్ణించుకోలేని పార్టీ జిల్లా నాయకులు ఏడాదిలోనే పదవి కోల్పోయేందుకు తెరవెనుక రాజకీయం చేశారన్నారు. వైసీపీ అధిష్ఠానం సీనియర్‌లకు కనీస ప్రాధాన్యం ఇవ్వడంలేదన్నారు. పార్టీ పదవుల్లో వెనుకబడిన సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడంలేదన్నారు. సీనియర్ నాయకుడు మోరీ రవి అధిష్ఠానాన్ని ప్రశ్నించాడని ఉద్దేశపూర్వకంగా మండలాధ్యక్ష పదవి నుంచి ఆయనను తప్పించారన్నారు. గతంలో జడ్పీటీసీ సీటు రవికి కేటాయించాల్సిఉన్నా, ఆఖరి నిమిషంలో అతన్ని తప్పించి మరొకరికి ఇచ్చారన్నారు. అధిష్ఠానం వైఖరితో పార్టీలో సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. స్థానిక సంస్థలకు ముందుగానే అత్యధిక సంఖ్యలో సీనియర్ నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధపడుతున్నారన్నారు.

హెల్త్ యూనిట్ భవనం శ్లాబ్ నిర్మాణం పూర్తి


శ్లాబ్ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ గణేశ్, అధికారులు

అనంతగిరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ కేంద్రంలోని పీహెచ్‌సీకి ఆనుకుని ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సుమారు రూ.36 లక్షలతో నిర్మాణంలో ఉన్న బ్లాక్ హెల్త్ యూనిట్ భవనానికి అధికారులు శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. సర్పంచ్ సిరగం గణేశ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన ఈ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన ఈసందర్భంగా కోరారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలోని ఉద్యోగులకు, గిరిజనులకు మేలు చేకూరుతుందన్నారు.

వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు బంద్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వారం రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో మెజారిటీ ప్రజలు బీఎస్ఎన్ఎల్ సేవల పైనే ఆధారపడుతున్నారు. అయినా, వారం రోజులుగా సేవలు నిలిచినా అధికారులు స్పందించపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు పునరుద్ధరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

31 నుంచి కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

పాడేరురూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో విద్యార్థినీ, విద్యార్థులకు, మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై కరాటే శిక్షణ తరగతులను ఈ నెల 31వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్టు కరాటే చీఫ్ ఇనస్ట్రక్టర్ బాకూరు పాండురాజు తెలిపారు. ఆసక్తిగలవారు 94909 97003, 94919 00210 నంబర్లకు సంప్రదించి అడ్మిషన్‌లు పొందాలని ఆయన కోరారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు


అస్తవ్యస్తంగా ఉన్న పినకోట భైరవ స్వామి గుడికి వెళ్లే సీసీ రహదారి

అనంతగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ పరిధి సుద్దబడువా నుంచి పినకోట భైరవస్వామి గుడి వరకు గల సీసీ రోడ్డు ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు అసంపూర్తిగా వదిలేయడం పై గిరిజనులు మండిపడుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం జీనబాడు నుంచి పినకోట వరకు ట్రైబల్ వెల్ఫేర్‌శాఖ నిధులు వెచ్చించి తారురోడ్డును నిర్మించారు.. అయితే, ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీశాఖ పరిధిలో మార్పు చేశారు. 12 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో రోడ్డంతా గోతులతో నిండి ఉండేది. దీంతో గత ఏడాది ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో జీనబాడు నుంచి పినకోట వరకు తారురోడ్డు రూ.1.5 కోట్లతో తారురోడ్డును మరమ్మతులు చేయించారు. అయితే, సుద్దబడువా నుంచి పినకోట భైరవస్వామి గుడి వరకు అర కిలో మీటరు మేర సీసీరోడ్డును నిర్మించకుండా వదిలేశారు. దీంతో 12 ఏళ్ల కిందట నిర్మించిన సీసీరోడ్డు పెద్ద గోతులతో శిథిలమై రాకపోకలకు వీలుకాని స్థితిలో శిథిలావస్థకు చేరింది. జీనబాడు నుంచి సుద్దబడువా వరకు ప్రయాణం బాగా ఉన్నా, అక్కడి నుంచి పినకోట వరకు వెళ్లాలంటే నరకం కనిపిస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు స్పందించి, అర కిలో మీటర్ సీసీరోడ్డు పూర్తి చేయాలని, లేకుంటే ఆందోళన చేపడతామని సర్పంచ్ సిగరం గణేశ్, గ్రామస్థులు హెచ్చరించారు.

కూటమి పాలనపై ఆరోపణలు తగవు

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై టీడీపీ నేతలు ధ్వజం


ఎమ్మెల్యే వ్యాఖ్యలపై నిరసన వ్యక్తంచేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కొయ్యూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తు కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయటం పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు తగదని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాకురు చంద్రరావు, తోట దొరబాబు తదితరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ శనివారం మండల కేంద్రంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ పేరుతో ఎమ్మెల్యే నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు గిరిజనులను మోసాలకు గురిచేసిందన్నారు. ముఖ్యంగా జీవో 3 రద్దు, జాబ్ క్యాలెండర్ అమలు చేయలేదన్నారు. డీఎస్సీ, ప్రత్యేక, మూడు రాజధానుల పేరిట ఎన్నెన్నో మోసాలకు వైసీపీ పాల్పడిందని వారు విమర్శించారు. అలాగే, ప్రజలు ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపిస్తే వారి సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించకుండా ఉండడం విశ్వేశ్వరరాజుకు తగునా.. అని ప్రశ్నించారు. ఆ పార్టీ నిర్వహించిన నిరసనకు ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులే హాజరుకాలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల హామీలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం ఆపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరామూర్తి, నేతలు భీమజు, రామూర్తి, కె శ్రీనుబాబు, కిముడు శ్రీరాములు, రమాదేవి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ నేత సుధాకర్ రెడ్డి మృతి తీరని లోటు'


సురవరం సుధాకరరెడ్డి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

కొయ్యూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉల్లి సత్యనారాయణ, తదితరులు పేర్కొన్నారు. ఆదివారం అంతాడ పంచాయతీ మునసల గ్రామంలో మండల కార్యదర్శి సూరిబాబు ఆధ్వర్యంలో దివంగత నేత సురవరం సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి పార్టీకు చేసిన సేవలు, ప్రజా సమస్యలపై చేపట్టిన ఉద్యమాలను వివరించారు. రెండు దఫాలు నల్లగొండ ఎంపీగా గెలిచి పేదల కోసంఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు యువత సురవరంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఇరవాడ దేముడు, నానాజీ, రాంబాబు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విలు విద్యలో మెరిసిన విద్యార్థులు


విలువిద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్

పాడేరురూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల విశాఖపట్నం కొమ్మాదిలో నిర్వహించిన జోన్-1 విలువిద్య పోటీలలో స్థానిక మోదమాంబ హైస్కూల్‌కు చెందిన ఊడి యశస్వి, వంతాల కీర్తి అత్యున్నత ప్రతిభను కనపరిచి కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నట్టు చెప్పారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని ఈసందర్భంగా ఆమె ఆకాంక్షించారు.

డీఎస్సీలో మూడు ఉద్యోగాలకు అర్హత


డీఎస్సీలో ప్రతిభ చాటిన నరాజీ దేవిడ్

అనంతగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోకూరు పంచాయతీ జాకరవలస గ్రామానికి చెందిన నరాజీ దేవిడ్ డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఎస్టీ కేటగిరిలో స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు ఇంగ్లీష్‌లో, టీజీటీ ఇంగ్లీష్ సబ్జెక్టు విభాగాల్లో రెండో ర్యాంకులు, టీజీటీ సోషల్ సబ్జెక్టులో మూడో ర్యాంక్ సాధించి ఉద్యోగ ఎంపికలో అర్హత సాధించారు. గ్రామంలోని నరాజీ అర్జున్, తల్లి కాసులమ్మ దంపతుల ఏకైక కుమారుడు నరాజీ దేవిడ్.. విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే సాగింది. వ్యవసాయం ఆధారపడి ఈ కుటుంబం జీవిస్తోంది.ఈస్థితిలో మెగా డీఎస్సీలో అర్హత సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

పెదకోట - జాలడ రోడ్డును పట్టించుకోరా?


అధ్వానంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న పినకోట సర్పంచ్ సిగరం గణేశ్

అనంతగిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ పెదకోట-జాలడ వరకుగల సుమారు 13 కిలోమీటర్లు మేర గోతులతో అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పినకోట సర్పంచ్ సిరగం గణేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. పలుచోట్ల గోతులతో పాటు కొన్నిచోట్ల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిందని తెలిపారు. అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం పినకోట, జీనబాడు, పెదకోట, కివర్ల నాలుగు పంచాయతీల పరిధిలోని గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నాలుగు పంచాయతీల ప్రజలు.. పెదకోట-జాలడ మీదుగా హుకుంపేట మండలం ఉప్పచేరుకుని, అక్కడ నుంచి పాడేరు వెళ్లేందుకు ఇదే ప్రధానమార్గమని,ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డును మరమ్మతులు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు..

ఇంటర్మీడియట్ విద్యా ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం ఉమ్మడి జిల్లా ఎన్నికలను ఆదివారం కలెక్టరేట్ జంక్షన్‌లోని ఏపీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా జీవీ అప్పారావు, ఉపాధ్యక్షుడిగా బంకమల్లి రామారావు, కార్యదర్శిగా బీసీహెచ్ సుధాకర్, కోశాధికారిగా ఎన్. మురళీమోహన్, మహిళా కార్యదర్శిగా బి.సుశీల, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు ఈశ్వరరావు, రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలలో 140 మంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి: ఏవో

చింతపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి టి.మధుసూదనరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయశాఖ ఈ- క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ-క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంట, రైతు వివరాలు ఈ-క్రాప్‌లో ఉంటేనే రాయితీ విత్తనాలు, ఎరువులతోపాటూ వ్యవసాయ రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ-క్రాప్ కోసం గ్రామ సచివాలయం ఉద్యాన, వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల పంట పొలాలకు వచ్చి ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి: ఎస్ఐ


ఎస్ఐ రమణ

పెదబయలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పక తీసుకోవాలని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు తమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇందులో భాగంగా మండపాల అనుమతులకు ఓ వెబ్‌సైట్‌ను క్రియేట్ చేశామని, సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరిస్తామన్నారు. ఎటువంటి రుసుము చెల్లించాల్సి అవసరంలేదన్నారు. అనంతరం సంబంధిత పోలీసులు మండపస్థలాన్ని తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయన్నారు. పూర్తి వివరాలకు ఫోన్:94409 04227లో సంప్రదించాలని కోరారు.

లభించని పర్యాటకుడి ఆచూకీ


గల్లంతైన యువకుడి బ్యాగ్ ఒడ్డుకు తీసుకు వచ్చి పరిశీలిస్తున్న సహాయక సిబ్బంది

ముంచంగిపుట్టు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబి)లో గల డుడుమ జలపాతంలో గల్లంతైన ఒడిశా బరంపూర్‌కు చెందిన సాగర్ కుండు ఆచూకీ కానరాలేదు. తన స్నేహితుడితో కలసి సాగర్ కుండు శనివారం డుడుమ జలపాతాలను చూసేందుకు వచ్చి, నీటి ప్రవాహంలో దిగి డ్రోన్ కెమెరాతో పరిసర అందాలను చిత్రీకరిస్తున్న సమయంలో నీటి ఉధృతికి అతను గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతు అయిన పర్యాటకుడి ఆచూకీ కోసం ఒడిశా కోరాపుట్టుకు చెందిన ఒడ్రాఫ్ బలగాలు, లమతాపుట్టుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృత గాలింపులు చేపట్టారు. గల్లంతైన యువకుడి ఆచూకీ మాత్రం కానరాలేదు. అయితే, అతనికి చెందిన బ్యాగ్‌ను నీటిలో వారు గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చారు. అందులో డ్రోన్ కెమెరాలకు చెందిన బ్యాటరీలు, ఇతర వస్తువులు ఉన్నాయని అగ్నిమాపక అధికారి ఉమేష్‌బాగ్ తెలిపారు. గల్లంతైన యువకుడు కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. బీటెక్ చదువుతున్న తన కుమారులు ఇలా జలపాతంలో గల్లంతుకావడంతో తీవ్ర వేదనతో ఉన్నారు. సోమవారం గాలింపులు మరో మారు చేపడతామని అధికారులు చెప్పారు.

'స్త్రీ శక్తి సభ విజయవంతం చేయాలి'

పాడేరురూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 26వ తేదీ మంగళవారం నిర్వహించనున్న స్త్రీ శక్తి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వ మహిళా నాయకులు విజయవంతం చేయాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మహిళల భద్రత, సంక్షేమం, అభివృద్ధి విషయం లో ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలకు కట్టుబడి అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ మంగళవారం 10 గంటలకు పాడేరులో స్త్రీ శక్తి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు.

జల వనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

... 5వ పేజీ తరువాయి

ఎస్‌ఈ బాధ్యతలు అప్పగించారు. వర్షాకాలంలో గోదావరికి వరదలు వస్తుంటాయి. ఆ సమయంలో అక్కడ ఏఈ నుంచి సీఈ వరకూ ప్రతి ఒక్కరిపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. రుతుపవనాలు సీజన్ గోదావరికి వచ్చే వరదపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇటువంటి సమయంలో వారు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం ఇత్యాది అంశాలను సమీక్షించి ఆదేశాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని జల వనరుల శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల ఈఈలకు మూడు పాత జిల్లాల్లో ఎస్‌ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే సబబుగా ఉండేదని వ్యాఖ్యానిస్తున్నారు. జల వనరుల శాఖలో డీఈ, సీఈల ఖాళీలను భర్తీచేయకుండా కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తరాంధ్రలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇక్కడ ఖాళీలను భర్తీచేసేలా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

అన్నదాతకు అండగా ఐఎండీ

... 5వ పేజీ తరువాయి

పథకాన్ని ప్రారంభించింది. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఉన్న ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ ద్వారా వారంవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల రైతులకు వాతావరణ హెచ్చరికలు, వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు తెలియజేస్తున్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తలు ప్రతి మంగళవారం సమావేశమై భారత వాతావరణ సంస్థ అందజేసిన సమాచారం ఆధారంగా రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. వీటిని రైతుల మొబైల్ ఫోన్లు, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా అందజేస్తున్నారు. రాగల ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం, వర్ష సూచనలతోపాటు వాతావరణంలో వచ్చిన మార్పులకు అనుకూలంగా రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను సూచిస్తుంటారు. వర్షాలు పడే పరిస్థితి ఉంటే పంట కోతలు, నూర్పు పనులను వాయిదా వేసుకోవాలని సూచిస్తారు. మబ్బు పట్టిన వాతావరణం వల్ల పంటలను ఆశించే చీడపీడలు వాటి నివారణ చర్యలను వెల్లడిస్తారు. భారీ వర్షాల కారణంగా పంటలు ముంపునకు గురైతే పొలంలో చేపట్టాల్సిన పనులను సూచిస్తారు. గత ఏడాది వరి కోతలు, నూర్పుల సమయంలో వచ్చిన వర్షాల గురించి రైతులను ముందుగా అప్రమత్తం చేయడం వల్ల వారు నష్టాన్ని తగ్గించుకోగలిగారు.

ఎంతో ప్రయోజనంగా ఉంది



వాతావరణ ఆధారిత వ్యవసాయ సమాచారం ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంది. నేను కూడా శాస్త్రవేత్తలతో నేరుగా సంభాషించి ఆ సమాచారాన్ని మిగతా రైతులకు అందజేస్తున్నాను.

- పి.సత్తిబాబు రైతు, కానాడ, రావికమతం మండలం

వాతావరణ ఆధారితక సాగుపై రైతులకు అవగాహన



వివిధ వాతావరణ పరిస్థితులకు అవసరమైన సాగు పద్ధతులను రూపొందించాం. తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు, పైరు విత్తిని తొలి దశలో నీటి ఎద్దడికి గురైతే, పెరిగే దశలో నీటి ముంపుకు గురైతే, రుతుపవనాలు నాలుగు వారాలు ఆలస్యం అయినప్పుడు, ఎనిమిది వారాలు ఆలస్యం అయినప్పుడు.. ఇలా వివిధ పరిస్థితుల్లో ఆయా పంటలకు అవసరమైన యాజమాన్య పద్ధతులను సిద్ధంచేశాం. అవసరం, సమయాన్నిబట్టి రైతులకు తెలియజేస్తాం. రైతులకు, వ్యవసాయ విద్యార్థులకు వాతావరణ ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

-డాక్టర్ కె.వి.రమణమూర్తి, నోడల్ అధికారి, గ్రామీణ కృషి మౌసం సేవా పథకం

రవాణా కష్టాలు

... 5వ పేజీ తరువాయి

కురిసిన భారీ వర్షానికి విజయరామరాజుపేట కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. తరువాత వాగులో వరద ఉధృతి తగ్గినప్పటికీ, కాజ్‌వే పునరుద్ధరణ పనులు ఇంకా చేపట్టలేదు. ఆర్టీసీ బస్సులను ఇతర మార్గాల్లో నడుపుతుండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఒక కి.మీ. దూరం.. పది కి.మీ.ల ప్రయాణం

విజయరామరాజుపేట వద్ద తాచేరు గెడ్డపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే.. ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ రెండు మధ్య దూరం ఒక కిలోమీటరు కాగా, కాజ్‌వే ధ్వంసం కావడంతో చుట్టూ తిరిగి పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నది. తాచేరు గెడ్డకు ఇవతల విజయరామరాజుపేట, అవతల వడ్డాది గ్రామాలు వున్నాయి. విద్య, వైద్యం, వ్యాపారం, ఇతర అవసరాల నిమిత్తం నిత్యం వందలాది మంది అటుఇటు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు తాచేరు కాజ్‌వే కొట్టుకుపోవడంతో విజయరామరాజుపేట ప్రజలు మంగళాపురం, కేజే పురం మీదుగా సుమారు పది కిలోమీటర్ల ప్రయాణించి వడ్డాది చేరుకోవాల్సి వస్తున్నది.

కాగా కాజ్‌వే పునరుద్ధరణపై ఆర్‌అండ్‌బీ జేఈ సత్యకుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రూ.30 లక్షలు అవసరమని ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే కాజ్‌వే పునరుద్ధరణ పనులు చేపడతామని చెప్పారు.

ఐసీడీఎస్‌కు కేపీఎల్ లక్ష్యాలు

... 5వ పేజీ తరువాయి

ఐదు లీటర్లు పాలు, న్యూట్రిషన్ కిట్, ఒక కిలో అటుకులు, రెండు కిలోలు రాగి పిండి, 250 గ్రాముల బెల్లం, వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం అందజేయాలి. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలు చిన్నారులకు బాలామృతం, 30 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఇవ్వాలి. మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీ పెట్టే ఆహారంలో 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కంది పప్పు, ఐదు మిల్లీలీటర్ల మంచినూనె, కోడి గుడ్డు వుండాలి. రోజూ 100 మిల్లీలీటర్ల పాలు ఇవ్వాలి. కాగా జిల్లాలోని ఐసీడీఎస్‌ల పరిధిలో ఉన్న పిల్లల్లో బరువు తక్కువ ఉన్న వారు 18.29 శాతం మంది, వయస్సుకి తగ్గ ఎత్తు లేని పిల్లలు 7.8 శాతం వున్నట్టు అధికారులు గుర్తించారు. పౌష్టికాహారం అందించడం ద్వారా ఈ ఏడాది తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లలను రెండు శాతం చొప్పున తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది.

కేపీఎల్ లక్ష్యాలు ఇవే..

- గర్భిణులు, బాలింతలకు వంద శాతం టీహెచ్ఆర్ ఇవ్వాలి
- ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు వంద శాతం టీహెచ్ఆర్ ఇవ్వాలి
- వయసుకి తగ్గ ఎత్తు లేని పిల్లలను రెండు శాతం తగ్గించాలి
- వయసుకి తగ్గ బరువు లేని పిల్లలను రెండు శాతం తగ్గించాలి
- ప్రీ స్కూల్ పిల్లలు నెలలో కనీసం 21 రోజులు హాజరవ్వాలి
- బాల్య వివాహాలను నిరోధించాలి

జీవీఎంసీలో ఇక 10 జోన్లు

... 5వ పేజీ తరువాయి

ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్నాయి. ఒక జోన్.. రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించి ఉంది. తూర్పు నియోజకవర్గంలో ఉన్న 9, 10, 11, 12, 13 వార్డులు జోన్-2 (మధురవాడ)జోన్‌లో ఉన్నాయి. అదే విధంగా భీమిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న 5, 6, 7, 8, 98 వార్డులు జోన్-2లో ఉన్నాయి. ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఉన్న 14, 24, 25, 26 వార్డులు జోన్-3 లో ఉన్నాయి. నియోజకవర్గం ఒకటి, జోన్ మరొకటి కావడంతో అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటే రెండు, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు రెండు, మూడు జోన్‌ల అధికారులను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గం పరిధిలోని వార్డులు ఆ జోన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, అదనపు, జోనల్ కమిషనర్లు నాలుగు నెలల కిందట సమావేశమై వార్డు, జోన్‌ల సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా జోన్‌లు ఏర్పాటు చేస్తే ఏ వార్డులు ఎందులో చేరుతాయనే దానిపై ఒక డ్రాఫ్ట్ తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా కావడంతో ఒక వార్డు ప్రజలు జోన్ కార్యాలయానికి రావాలంటే చివరన వుండే వార్డుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని, ఈ నేపథ్యంలో ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లుగా విభజించాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పరిధిలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కో జోన్, భీమిలి, పెందుర్తికి రెండేసి జోన్‌లు ఏర్పాటు కానున్నాయి.

మట్టి వినాయకులను పూజించండి: ఎమ్మెల్యే రాజు



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని లేకుండా ఇళ్లల్లో మట్టి వినాయక విగ్రహాలతోనే వినాయక చవితి జరుపుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ నాయకుడు, సకురు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సకురు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సకురువీధిలో 3 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఎమ్మెల్యే రాజు మట్టి వినాయక విగ్రహాలతోపాటు, వినాయక వ్రతపుస్తకాలను అందించారు. ఈ కార్యక్రయంలో వినాయక, శివాలయం కమిటీ చైర్మన్లు పసుమర్తి సాంబ, గూనూరు సురేశ్‌లతో పాటు, టీడీపీ జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీనివాసరావు, కొట్నాపు రూపాదేవి, చిన్న ఇతర కార్యకర్తలు స్థానిక మహిళలు భక్తులు భారీగా తరలివచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒక చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రావికమతం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకోట జడ్పీ హైస్కూల్‌లో 1984-85లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఒకే చోటకి చేరిన వారు చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు వడ్లమాని సూర్యానారాయణ, ఆర్ వి. స్వామి దంపతులను ఘన సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. వీరంతా కలసి చదువుకున్న పాఠశాలకు పర్నీచర్ సమకూర్చాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోట వెంకటరమణ, పరవాడ నారాయణదొర, కోట సత్యనారాయణ, అలమండ శ్రీనివాసరావు, వీరనాల గోవింద, గుమ్మడు నాగరాజు, వాసంశెట్టి శ్రీనివాసరావు, మలస కిశోర్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

రోలుగుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి రాజుబాబు తెలిపారు. పిల్లలతో కథల పుస్తకాలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకత వివరించారు. పిల్లల్లో పుస్తకాల పఠనంపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం



ఏటిగైరంపేటలో ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న ఏవో సుధారాణి

గొలుగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువులను ప్రభుత్వం ప్రకటించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి హెచ్చరించారు. మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో పలు ఎరువుల దుకాణాలను ఆదివారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులకొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రైతులను ఇబ్బందులు పెట్టకూడదని, నిర్దేశిత ధరలకే ఎరువులను విక్రయించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ఏవో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువజన సంఘానికి వినాయకస్వామి ఆలయం అప్పగింత



ఆలయంలో కౌన్సిలర్ రాజేశ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గొలుగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని ఐదురోడ్ల జంక్షన్‌లో బాలవినాయక ఆలయ నిర్వహణ బాధ్యతలను దేవదాయ శాఖ నుంచి రద్దు చేసి వినాయక యువజన సంఘానికి అప్పగించినట్టు ఈవో సాంబశివరావు ఆదివారం తెలిపారు. రూ.5 లక్షల లోపు ఆదాయం కలిగిన ఆలయాలను దేవదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ఆలయ కమిటీకి కౌన్సిలర్ రాజేశ్ ఆధ్వర్యంలో బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. ఈ కమిటీలో చైర్మన్‌గా ధనిమిరెడ్డి బుజ్జి, కార్యదర్శిగా రుత్తల గోవింద, సభ్యులుగా బొత్స నూకరాజు, ఫణి, లెక్కల చిన్నశివ నియమించామన్నారు. అనంతరం కౌన్సిలర్ రాజేశ్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు పాల్గొన్నారు.

కళ తప్పిన పోలీస్ డ్రిల్ మైదానం

- కొన్నేళ్ల వరకు మైదానంలో క్రీడాకారుల సాధన, పోటీలు
- ప్రస్తుతం తుప్పలు, వర్షనీటితో చెరువు తలపిస్తున్న వైనం
- మాడుగులలో క్రీడలకు యువత దూరం



గతంలో ఆటలతో సందడిగా కనిపిస్తున్న పోలీస్ డ్రిల్ మైదానం (ఫైల్)



వర్షపు నీరుతో చెరువును తలపిస్తున్న పోలీస్ మైదానం



చెరువును తలపించే మైదానంలో పశువుల సంచారం

మాడుగుల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ డ్రిల్ మైదానం నిరుపయోగంగా మారింది. గతంలో క్రీడాకారులతో కళకళలాడిన ఈ మైదానం ప్రస్తుతం తుప్పలతో కళావిహీనంగా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు చేరి చెరువుని తలపిస్తోంది. కనీసం క్రీడా మైదానానికి, పోలీసులకు సంబంధించి నివాస గృహాలకు కేటాయించిన భూమి అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉండదని స్థానికులు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. ఇదే అదనుగా ఈ ఖాళీ స్థలంపై వారి కన్నుపడింది. మాడుగుల నుంచి ఎం.కోడూరు వెళ్లే మార్గంలో ఈ పోలీసు డ్రిల్ మైదానం ఉంది. నాలుగేళ్ల కిందట అప్పటి ఎస్ఐ వై.తారకేశ్వరరావు ఆ మైదానంలో పిచ్చి మొక్కలను తొలగించి పోలీస్ డ్రిల్ మైదానాన్ని క్రీడా మైదానంగా తీర్చిదిద్దారు. చదువుకునే పిల్లకు క్రీడలపై ఆ సక్తి చూపించే దిశగా చర్యలు తీసుకున్నారు. క్రీడలతో కలిగే ఉపయోగాలను పిల్లలకు వివరించారు. అయితే, అప్పట్లో ఇక్కడ జరిగే మోదకొండమ్మ అమ్మవారి జాతరకు ఈ మైదానంలో రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, సర్కస్‌లు ఏర్పాటు చేసేవారు. అయితే ఆ స్థలాన్ని ఎవరూ వినియోగించరాదని అప్పటి అధికారులు కట్టడి చేశారు.గతంలో ఇక్కడ పండగల సమయాల్లో వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ప్రస్తుతం అవి కూడా లేకుండా పోయింది. దీంతో డ్రిల్ మైదానం వృథాగా మారడంతో ఆ స్థలంలో బహిరంగ మలవిసర్జనకు వినియోగిస్తుండడంతో జనాలు ఇబ్బంది పడుతుండేవారు.

ఈ నేపథ్యంలో ఎస్ఐ తారకేశ్వరరావువచ్చి ఈ మైదానం రూపురేఖలు మార్చారు. తుప్పలు, చెత్తా చెదారం తొలగించి మైదానమంతా శుభ్రం చేయించారు. బాల్ బాడ్మింటన్, రింగ్‌టెన్నిస్, షటిల్ కోర్టులు వేయించారు. ఎక్సవేటర్‌తో ఎదురుగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేయించి పూల మొక్కలు నాటారు. గ్రామంలోని యువకులు, విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని ప్రయత్నించారు. విద్యార్థులకు బాల్‌బాడ్మింటన్ బ్యాట్‌లు ఉచితంగా అందించి చేయూతనిచ్చారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించిన పలువురు క్రీడాకారుల శిక్షణతో ఈ మైదానం కళకళ లాడేది. అయితే, ఎస్ఐ తారకేశ్వర్రావు బదిలీపై వెళ్లడంతో గతంలో మాదిరిగానే పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారింది.

అప్పట్లో బాల్‌బ్యాడ్మింటన్ నేర్చుకున్న యువత కాలక్రమేపి ఆ క్రీడలను వదిలేశారు. అయితే, ప్రస్తుతం గ్రామంలో అత్యధికశాతం యువత ఉండి క్రీడలపై ఆసక్తి చూపుతున్నా క్రీడా మైదానం లేక మిన్నకుండిపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గతంలో మాదిరిగా ఈ పోలీస్ డ్రిల్ మైదానాన్ని క్రీడా మైదానంగా మార్పు చేసి యువతకు చేయూతను అందించాలని గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువతీ, యువకులు కోరుతున్నారు. లేదా పోలీసులకు సంబంధించి నివాస గృహాల నిర్మాణాలకు అయిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాఫీ పొడి తయారీ కేంద్రం శంకుస్థాపనకు ఏర్పాట్లు



కాఫీ పొడి తయారీ కేంద్రం నిర్మాణానికి సిద్ధం చేసిన స్థలం ఇదే..

మాకవరపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో కాఫీ పొడి తయారీ కేంద్రం నిర్మాణం శంకుస్థాపనకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ గ్రామంలో కాఫీ పొడి తయారీ కేంద్రం కేటాయిస్తూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాడేరు పర్యటనలో శిలాఫలకం ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శెట్టిపాలెంలో 12 ఎకరాల ప్రభుత్వ భూమిలోని చెట్లతో పాటు మొక్కలు తొలగించారు. రూ.10 కోట్లతో నిర్మాణం చేప డుతున్న కాఫీ పొడి తయారీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఢిల్లీ పర్యటన అనంతరం శంకుస్థాపన పనులు చేపడతామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కంపెనీ ఏర్పాటు చేస్తున్న స్థలం వరకు తాత్కాలిక రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేశారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా తారకవేణుగోపాల్



గొలుగొండ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల అధ్యక్షుడిగా చిటికెల తారకవేణు గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కొత్తజోగంపేట గ్రామంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఆదివారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడిగా తారకవేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా రాయపురెడ్డి అప్పలనాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడిగా అల్లు రమణ, ఉపాధ్యక్షుడిగా గండేపల్లి రాము, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలిగా కిల్లాడ సునీతోపాటు పలు అనుబంధ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తరకవేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులోఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చోద్యం పీఏసీఎస్ అధ్యక్షుడు చిటికెల సాంబమూర్తి, నాయకులు కొల్లి సత్యనారాయణ, ఆదపురెడ్డి గోపి, సుర్ల బాబ్జీ, కొల్లి రాంబాబు, పలుగ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



పెంటకోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెంటకోటలో ఆదివారం రూ. రెండు కోట్లతో నిర్మించే బహుళార్థక సాధక మత్స్యకేంద్రం, రూ.1.52 కోట్లతో నిర్మించే కల్వర్టు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు రెండు బహుళార్థక సాధక మత్స్యకేంద్రాలు మంజూరయ్యాయని, వాటిలో ఒకటి పరవాడ, మరొకటి పెంటకోటలో నిర్మిస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు 20 వేల రూపాయలను భరోసా ఇచ్చామన్నారు. గత వైసీపీ పాలకులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వ నాశనం చేశారని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కల్వర్టును కనీసం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వినోద్‌రాజు, చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలు, పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, ఎం.రమాకుమారి, గూటూరు శ్రీనివాసరావు, జిల్లా మత్స్య శాఖాధికారి జి. విజయ పాల్గొన్నారు.

హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రామకృష్ణారావు

రోలుగుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ రామకృష్ణారావు హెచ్చరించారు. ఆదివారం స్థానికంగా వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడిపిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగ్గా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఏఎల్ పురం యువత సత్తా



ఉద్యోగాలకు అర్హత సాధించిన అప్పలనాయుడు.. వెంకటేశ్.. సత్యలోవరాజు.. ముప్పల రమణ.. రుత్తల భవాని.. ఎం.నానిబాబు. ఈ.లోవరాజు.. ఎందేముడు

ఉపాధ్యాయ ఉద్యోగాలకు పది మంది అర్హత

కృష్ణాదేవిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ పరిధి ఏఎల్‌పురంలో ప్రభుత్వం ప్రకటించి డీ ఎస్సీ ఫలితాల్లో పదిమంది యువతీయువకులు అర్హత సాధించారు. వీరిలో ఆరు గురు స్కూల్ అసిస్టెంట్లకు, నలుగురు ఎస్జీటీ విభాగంలో ర్యాంకులు సాధించారు. చిటికెల అప్పలనాయుడు విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ సబెక్టులో (6వ ర్యాంకు), గుదే వెంకటేష్ స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ (10వ ర్యాంకు), ముప్పల రమణ స్కూల్ అసిస్టెంట్ సోషల్ (21వ ర్యాంకు) చింతల నాగ వెంకట సత్యలోవరాజు స్కూల్ అసిస్టెంట్ సోషల్ జిల్లాలో (32వ ర్యాంకు), కొల్లు దుర్గాప్రసాద్ ఎస్జీటీ (84వ ర్యాంకు), రుత్తల భవాని ఎస్జీటీ (128 ర్యాంకు), ఈ.లోవరాజు స్కూల్ అసిస్టెంట్ వ్యాయాముపాధ్యాయుడు (146 ర్యాంకు), సింగిడి జ్యోష్నా ఎస్జీటీ (163 ర్యాంకు), మురగాడ నాని బాబు స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ (220వ ర్యాంకు), మారుడిపూడి దేముడు ఎస్జీటీ (ర్యాంకు 2,156 ర్యాంకు)తో అర్హులుగా నిలిచారు.

వీరిలో గుదే వెంకటేష్ పదేళ్లగా ఈ ప్రాంతంలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా, చిటికెల అప్పలనాయుడు నాలుగేళ్ళగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే, చిటికెల అప్పలనాయుడు, చింతల నాగవెంకటసత్యలోవరాజు, మురగాడ నాని (ఎస్జీటీ) పీజీటీ, టీజీటీలోనూ అర్హత సాధించారు. వీరంతా స్థానిక ప్రభుత్వం పాఠశాలల్లో చదివారు. ఒకే సారి గ్రామంలో పదిమంది డీఎస్సీలో అర్హత సాధించటంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదానంతో పారిశుధ్య పనులు



కోనాం మొండివీధిలో శుభ్రంచేస్తున్న గ్రామస్థులు

చీడికాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం మొం డివీధిలోని స్థానికులు ఆదివారం డ్రైనేజీ చుట్టూ ఉన్న తుప్పలను తొలగించి పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ అధికారులు స్పందించి ఇకనైనా పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

డీఎస్సీ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

- ఒకే అభ్యర్థి.. కానిస్టేబుల్, డీఎస్సీలోనూ అర్హత



డీఎస్సీ, కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత పొందిన బంటు శివ



పీజీటీ కామర్స్ జోన్-1లో మొదటి ర్యాంక్ సాధించిన అనిల్



డీఎస్సీలో రెండు ఉద్యోగాలకు అర్హత సాధించిన సురేశ్

కె.కోటపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడు వా డ గ్రామానికి చెందిన బంటు శివ డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించారు. శివ 17 సంవత్సరాలు ఆర్మీలో సేవలందించి డిసెంబరు 2021లో రిటైర్ అయ్యారు. కాగా, గత కానిస్టేబుల్ సెలక్షన్‌లో ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్ట్ ఉత్తీర్ణత సాధించి మెయిన్స్ రాశారు. అయితే, ఆర్మీ సర్వీసులో ఉంటున్న సమయంలో బీఈడీ క్లియర్ చేశారు. అప్పట్లోనే డీఎస్సీ కూడా ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల వచ్చిన కానిస్టేబుల్, డీఎస్సీ ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆర్మీ ఎక్స్ సర్వీస్‌మెన్ ఓపెన్ కేటగిరిలో విశాఖ జిల్లాలో 26వ ర్యాంక్ సాధించారు.

పీజీటీ కామర్స్‌లో అనిల్‌కుమార్‌కు మొదటి ర్యాంక్

చోడవరం: డీఎస్సీ ఫలితాల్లో పీజీటీ కామర్స్ విభాగం జోన్-1లో మద్దాల అనిల్‌కుమార్ మొదటి ర్యాంకు సాధించి సత్తాచాటారు. కె.కోటపాడు మండలం గొండుపాలెంకు చెందిన అనిల్‌కుమార్, పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్ కామర్స్ పోస్టుకు ఎంపికయ్యారు. ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ లేదా ఏపీ మోడల్‌స్కూళ్లలో చదివే సీఈసీ, ఎంఈసీ కోర్సులు చదివే విద్యార్థుల బోధనకు సంబంధించి డీఎస్సీ జోన్-1లో ఒకే ఒక్క పోస్టు కేటాయించగా, పోటీని తట్టుకుని అనిల్ కుమార్‌దీనిని సాధించడం గమనార్హం. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన అనిల్‌కుమార్ తండ్రి సత్యనారాయణ చనిపోయారు. తల్లి దేవి. లెక్చరర్ కావాలన్న పట్టుదలతో చదివిన అనిల్‌కుమార్ ఆ పోస్టులకు సాధన చేశాడు. ఇదే సమయంలో డీఎస్సీ రావడంతో తొలి ప్రయత్నంలో కొలువు సాధించడం గమనార్హం.

డీఎస్సీలో రెండు ఉద్యోగాలకు..

దేవరాపల్లి: స్థానిక కుమ్మరవీధికి చెందిన వాలేటి సురేశ్ డీఎస్సీ ఫలితాల్లో అర్హత సాధించారు. ఎస్జీటీలో 87.2 మార్కులు 45వ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్ సబ్జెక్టు 32వ ర్యాంక్ సాధించారు. సురేశ్‌ను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు అభినందించారు.